

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 25-5-98)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఆత్మముత్యం, మన హృదయగుహలో ఉంది. మనలో ఉన్న సంస్కారములను కాల్చి బూడిద చేస్తే లోపల ఉన్న ఆత్మముత్యం మన చేతికి అందుతుంది. మనకు ఉన్న సంస్కారముల నుండి విడుదల పొందటానికే పూజ, జపం, ధ్యానం. మనస్సుకు, ఇంద్రియాలకు ఉద్రేకం రాకుండా చూసుకోవాలి. ఫలితం ఆశించి చేసే సేవ సంఘసేవకాదు. లోకానికి సంబంధించిన ప్రయోజనం కోరి మనం సంఘ సేవ చేస్తే ఆ ప్రయోజనం వస్తుంది. కాని నీ దేహం ఎంత నిజమో, ఈ లోకం ఎంత నిజమో, అది కూడా అంతే నిజం. మనం చేసే సంఘసేవ నిజమైతే, ఆడంబరము లేనిది అయితే అది మాయలో నుండి బయటకు రావటానికి సహకరిస్తుంది. పని పనికోసమే చేస్తే భగవదర్పితంగాగనుక చేస్తే భగవదనుగ్రహానికి పాత్రులవుతాము. భగవదనుగ్రహానికి పాత్రులు అవ్వకుండా భగవదనుభవం కలుగదు. నిజమైన ఈశ్వరుడు మన హృదయంలో ఉన్నాడు. ఈ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో, ఏ పని నిమిత్తం వచ్చిందో దాని ప్రకారం ఈ దేహాన్ని త్రిప్పుతూ ఉంటాడు. వాడు నీ హృదయంలోనే ఉన్నాడు. మనం వాడిని శరణువేడుకోము. ఎక్కడో ఉన్న దేవుడిని శరణు వేడుకొంటాము. మన హృదయంలోనే ఉండి మనలను కంట్రోలు చేస్తున్న ఈశ్వరుడిని సంపూర్ణంగా శరణు వేడుకొంటే మనలను మాయలో నుండి బయటకు తీసుకొని వస్తాడు. మనం చేసేది కృషి ఆయన ఇచ్చేది కృప.

మనం చేసే పనులలో, మాట్లాడే మాటలలో సాధ్యమైనంత వరకు వ్యక్తిభావనను తగ్గించుకోవాలి. మీరు చేసే సంఘ సేవ వలన వ్యక్తి భావన పెరుగుతూ ఉంటే మీకు సమాజంలో గౌరవం రావచ్చును కాని జ్ఞానంసున్నా, శాంతి సున్నా, పరలోకంలో మనపని సున్నా. దైవానుగ్రహం కోసం పనిచేస్తే రెండు లాభములు వస్తాయి. దైవాను గ్రహం వస్తుంది, మనం చేసే సేవ సమాజమునకు శాంతి ఇస్తుంది. మనం ఏమి ఆశించకుండా పనిచేస్తే మన మనస్సు నిర్మలం అవుతుంది, బుద్ధికి ఏకాగ్రత వస్తుంది. అది శుద్ధ భక్తి అవుతుంది. ప్రతి చిన్న దానికి ఆశిస్తే అది వ్యాపార భక్తి అవుతుంది. మనస్సు ఎప్పుడైతే నిర్మలయమయిందో, బుద్ధికి ఏకాగ్రత వచ్చిందో జాగ్రదావస్థ కూడా స్వప్నం అని మనకు తెలుస్తూ ఉంటుంది. స్వప్నంలో ఉన్నంత సేపు అది నిజమని మనకు అనిపిస్తుంది. జాగ్రదావస్థ లోనికి వచ్చాక అది నిజంకాదు అని మనకు తెలుస్తుంది. మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే మనం జాగ్రదావస్థలో ఉన్నప్పుడు కూడా జాగ్రదావస్థ కూడా నిజం కాదు అని మనకు తెలుస్తుంది. మనం పూజ చేసిన, జపం చేసిన ధ్యానం చేసిన మనం పవిత్రులం అవ్వటానికే. ఎప్పుడైతే పవిత్రత కలిగిందో

మన హృదయంలో ఉన్న సత్యవస్తువు తనంతటతానుగా మనకు వ్యక్త మవుతుంది.

సత్యమైన ఆత్మకి, ఈ దేహానికి ఇసుమంతయు సంబంధం లేదు. కాని ఈ దేహమే సత్యం అని అనుకొంటున్నాము. అసలు వస్తువును వస్తువుగా గుర్తించటం లేదు. సరికదా దానిని దేహానికి పరిమితం చేస్తున్నాము. అజ్ఞానం అంటే ఇదే. ఈ ముడి వీడదీసుకోవటం కోసమే ఈ సాధనలు, సత్సంగాలు, ప్రవచనాలు, ధ్యానాలు అన్నీ, అసలు వస్తువు గురించి తెలియకపోవటం వలన ఈ దేహమే అది అనుకొంటున్నాము. దేహం మరణించినపుడు నేను మరణిస్తున్నాను, దేహం పుట్టినప్పడు నేను పుడుతున్నాను అని అనుకొంటున్నాము. నీవు పుట్టే వస్తువు కాదు, మరణించే వస్తువు కాదు. మనం చేసే పని నిర్మలంగా, నిశ్చలంగా చేస్తూ ఉంటే మాట మాటకి ఇంద్రియాలు, మనస్సు ఉద్రేక పడకుండా చూసుకొంటూ పని చేస్తే వస్తువు తనంతట తానుగా వ్యక్తమవుతుంది. బాహ్యంగా ఏదో చేయుటం వలన వచ్చేది కాదు. ముందు నిర్మలత్వం కుదరాలి. నీ మాట, చేత నిర్మలంగా ఉండాలి. నీవు పని చేసేటప్పడు సక్సెస్ అయితే భగవంతుని ఆజ్ఞ వలన సక్సెస్ అయ్యాను అని గుర్తించాలి. నా తెలివి వలన ఆ పని పూర్తి చేసాను, అని అనుకొంటే నీకు తప్పని సరిగా గర్వం వస్తుంది. అంతా భగవంతుని అనుగ్రహమే మన చేతులలో ఏమీ లేదు. సుఖమూ అనుగ్రహమే, కష్టమూ అనుగ్రహమే. ఆయనకు తెలియకుండా ఏదీ జరగదు. ఎట్టి పరిస్థితులలోనూ మీరు గర్వం తెచ్చుకోవద్దు. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నప్పడు మీకు గర్వం వస్తుంది. అప్పడే మీరు జాగ్రత్తగా ఉండాలి. మనకి గర్వం వస్తూ ఉంటే మనం పాడైపోయే రోజులు దగ్గరగా ఉన్నాయి అని అర్థం.

సత్య వస్తువే తాను, తానే అది అయినప్పటికి మానవుడికి ఉండే వ్యక్తి భావన వలన, అలవాట్లవలన, ఆ వస్తువు తెలియటం లేదు కాబట్టి అసలు ఆ వస్తువే లేదు అనుకొంటున్నాడు. లౌకికుల మాటలను మనం ప్రమాణంగా తీసుకోకూడదు. భగవంతుడు చెప్పిన మాటలను, శాస్త్రం చెప్పిన మాటలను జ్ఞానుల యొక్క నడతను మనం ప్రమాణంగా తీసుకోవాలి. ఎవరికైనా నీవు సహాయం చేస్తే నీవు ఎక్కువ అని తీసుకొనే వాడు తక్కువ అని అనుకోవద్దు. అలా అనుకొంటే అజ్ఞానం పెరుగుతుంది. ఒక పండు ఎవరికైనా ఇస్తున్నాము అనుకోండి ఈ పండు మీకు ఇచ్చే అవకాశం మాకు కలుగజేయండి అంటాడు సత్వగుణం ఉన్నవాడు. అదే రజోగుణం ఉన్నవాడు అయితే ఇచ్చేతాను ఎక్కువవాడిని అని, పుచ్చుకొనే వాడు తక్కువ అని అనుకొంటాడు. సత్వగుణం ఉన్న వారితో స్నేహం చెయ్యి. రజోగుణం, తమో గుణం తగ్గించుకోవాలి. స్వాతిక గుణం పెంచుకోవాలి. భౌతిక సంపద ఉన్నవాడికి ఆత్మ ప్రకాశం తెలియదు, దైవీ సంపద ఉన్న వాడికి తెలుస్తుంది. నీకు ఉన్న సుగుణాలే దైవీ సంపద. మన మనస్సులో చాలా మాయపొరలు ఉన్నాయి. అతిగా మాట్లాడకుండా తక్కువగా మాట్లాడుతూ, ఇతరుల గొడవలలోనికి వెళ్లకుండా మీ పని మీరు చేసుకొంటూ, సత్పురుషుల సహవాసం చేస్తూ ఉంటే మన మనస్సులో ఉన్న మాయపొరలు తెగిపోతాయి. నేను వేరు, నీవు వేరు అనే బేధబుద్ధి వలన భయం వస్తోంది. ద్వైతంలో నుండే అన్నీ వస్తున్నాయి. అంతా నేనే అనుకొంటే ఏమీ లేదు. అప్పడు నీకు నిండుతనం వస్తుంది. నీవు లోకాన్ని భయపెట్టకు, నీవు లోకానికి

భయపడవద్దు. అప్పడు నీవు నాకు ఇష్టుడవు అవుతావు, నిన్ను నేను ప్రేమిస్తాను, నా అనుగ్రహానికి అర్హుడవు అవుతావు, నా స్వరూపం నీకు తెలుస్తుంది, అని భగవంతుడు చెపుతున్నాడు. నీకు తత్వం అర్ధమవుతూ ఉంటే నీ వేదన, రోదన అంతా ఈ క్షణంలో చల్లారిపోతుంది. సబ్జక్టు అర్ధమవుతూ ఉంటే మీ శరీరానికి బాధలు రావచ్చుగాని మనస్సులో ఉన్న దుఃఖం అంతా చల్లారిపోతుంది. మనస్సును యాతనా శరీరం అంటారు. ఈ యాతనా శరీరం యొక్క పోకడ, దాని మూలం తెలిస్తే నీకు ఎంత దుఃఖం ఉన్న ఇప్పడే చల్లారిపోతుంది. మన మాట వలన, చేత వలన, తలంపువలన మనకు దేహ బుద్ధి తగ్గాలి. అదే తపస్సు. శరీరానికి ఏ విధమైన రోగాలు, బాధలు వస్తున్నా నీకు తత్వం తెలిస్తే మనస్సులో ఉన్న దుఃఖం అంతా చల్లారిపోతుంది. దేహం చనిపోవటానికి సాధన అక్కరలేదు. ఆ దేహం ద్వారా జీవుడు పొందవలసిన అనుభవాలు అయ్యాక దేహం పోతుంది. కాని యాతనా శరీరం చని పోవటానికి సాధన చెయ్యాలి. దేహం చనిపోవటం వలన, పుట్టటం వలన యాతనా శరీరం మారదు. సత్పురుషులను ఆశ్రయించి, సాధన చేసి దానిని పోగొట్టుకోవలసిందే గాని కేవలం దేహం చనిపోవటం వలన అది పోదు, దేహం చనిపోవటం వలన ఎవడూ జ్ఞాని అవ్వడు.

పరిపూర్ణమైన భక్తి ఉంటేనే భగవంతుడు వారి బాధ్యతను తీసుకొంటాడు అని చెపుతారు. పూర్ణభక్తి లేకపోతే ప్రేమ, ఆప్యాయత ఉండదా? భగవంతుడు మన బాధ్యత తీసుకోడా? అని అడుగుతున్నారు. భక్తి లేకుండా, ప్రేమ లేకుండా ఎవరు ఉంటారు? ఎవరూ ఉండరు. ప్రతీ మనిషి తనను తాను ప్రేమించుకొంటున్నాడు. ఇతరులు అంటే ఇష్టం లేకపోయినా తను అంటే తనకు ఇష్టమే కదా. నీ హృదయంలో ఆత్మ అనేది ఒకటి ఉందని, చైతన్యం అనేది ఒకటి ఉందని తెలియటానికి నీవు అంటే నీకు ఇష్టమే గుర్తు. సృష్టిలో కోట్లాది మంది ఉన్నారు. తను అంటే తనకు ఇష్టం లేని మానవుడు ఎవడైనా ఉన్నాడా? లేడు. ఆత్మ తప్పించి ప్రతీదీ జడమే. ఎవరి మీద నీకు ప్రేమ లేదు కాని నీ మీద నీకు ఎందుకు ప్రేమ కలుగుతోంది? ఆత్మ ప్రేమ వస్తువు కాబట్టి అది నీ హృదయంలో ఉంది కాబట్టి నీమీద నీకు ప్రేమ కలుగుతోంది లేకపోతే నీ మీద నీకు ప్రేమ కలుగదు నీ హృదయంలో ఉన్న వస్తువు ప్రేమ వస్తువు కాకపోతే నీ మీద కూడా నీకు ప్రేమ కలుగదు. ఎంతో మందిని ద్వేషిస్తున్నావు కాని నిన్ను నీవు ప్రేమించుకొంటావు. నీలోపల ఉన్నది ప్రేమ వస్తువు అని చెప్పటానికి అదే గుర్తు. ఈశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడు. ఈశ్వరుడు అంతర్యామిగా లేకపోతే ఏ రూపం కూడా ఈ సృష్టిలోనికి రాదు. ఈశ్వరుడు అంతటా ఉన్నాడు. ప్రతీవాడి హృదయంలోనూ ఉన్నాడు. అందుచేత తనను తాను ప్రేమించుంకొటున్నాడు అంటే లోపల ఉన్న ఈశ్వరుడిని ప్రేమించటమే అవుతుంది. దేవుడి మీద ప్రేమ లేదు అంటావు ఏమిటి నిన్ను నీవు ప్రేమించుకొంటున్నావు అంటే అది దేవుని మీద ప్రేమకాకపోతే ఏమిటి? భగవంతుని అనుగ్రహం ఎప్పడూ ఉంది. కాని దానిని గ్రహించటానికి మనకు తపస్సు ఉండాలి. విద్య ఉండాలి. విద్య ఉండి తపస్సు లేకపోతే అది రాణించదు. విద్యతో పాటు తపస్సు ఉండాలి. అనుగ్రహ ప్రవాహంలో నీవు పడినప్పడు ప్రపంచంలో ఎవరికీ లేని కష్టాలు నీకు వచ్చినప్పటికి నదీ ప్రవాహంలో దుంగలు కొట్టుకొనిపోయినట్లు నీ కష్టాలు అన్నీ కొట్టుకొని

పోతాయి. అనుగ్రహం యొక్క ప్రభావం అటువంటిది. మానవుడికి అసాధ్యం ఉందిగాని అనుగ్రహానికి అసాధ్యం ఏముంది? అనుగ్రహప్రవాహంలో పడ్డావు అనుకో నీకు కష్టం ఎక్కడుంది? దుఃఖం ఎక్కడుంది? అవి వస్తే బాగుండును అని నీవు అనుకొన్నా అవి నీకు కనబడవు, పత్తా లేకుండా పోతాయి. మనకు ఆనందం, శాంతి కనబడటం లేదు కాని అనుగ్రహ ప్రవాహంలో పడిన వాడికి దుఃఖం, కష్టం కనబడవు.

కొంతమంది అహంకారముగా మాట్లాడతారు, అహంకారముగా నడుస్తారు, అహంకారముగా చూస్తారు, అహంకారముగా వ్రాస్తారు. ప్రతీదీ అహంకారమే. ఇలా అహంకారములో ఉన్నవాడు ఎలా అహంకారమయం అవుతాడో అలాగే భక్తుడు ఈశ్వరుని ప్రార్థించగా ప్రార్థించగా, పూజించగా పూజించగా, పరితపించగా పరితపించగా ఆ భక్తుడు ఈశ్వరమయం అవుతాడు. అప్పుడు అంతా ఈశ్వరుడే. ఈశ్వరుడిని ఈశ్వరుడి కోసమే ప్రేమిస్తూ ఉంటే ఆయనకు పని లేకపోయినా మన కోసం మానవ రూపం ధరించి నిన్ను ఆయన దగ్గరకు రప్పించుకోకుండా ఆయన నీ దగ్గరకు వచ్చి నీకు బోధ చేస్తాడు, ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకోంటాడు, నీ మొఖాన్ని హృదయంలో ఉన్న సత్యవస్తువు వైపుకు త్రిప్పుతాడు అంతే కాదు ఆ వస్తువు మీద ఆకర్షణ కలుగజేస్తాడు, దాని రుచి నీకు చూపిస్తాడు. నీరు మెరక నుండి పల్లానికి ఎలా వెలుతుందో అప్పడు నీ మనస్సు హృదయం వైపుకు అలా పరుగులు తీస్తుంది. అప్పడు ఆ వస్తువు నిన్ను తన లోపలకు గుంజుకొని తన స్వరూపాన్ని ఇస్తుంది. లోపల ఉన్న సత్యవస్తువును మినహాయింపులు లేకుండా శరణు వేడుకో. అలా శరణు వేడుకొంటే గత జన్మల నుండి వస్తున్న అలవాట్లు, దోషాలు ఉంటే వాటిలో నుండి ఆ వస్తువే నిన్ను విడుదలచేసి నిన్ను పవిత్రునిగా చేసి తనలో ఐక్యం చేసుకొంటుంది. అప్పడు భగవంతుడు ఎటువంటి శాంతి స్వరూపుడో, ఆనంద స్వరూపుడో అటువంటి ఆనందం, శాంతి నీకు కలుగుతుంది. అప్పడు ఎటుచూసినా శాంతే, సంపూర్ణ శరణాగతి ఎప్పడు సాధ్యమవుతుంది.? మన క్షేమం, మన బాగు మనకంటే ఈశ్వరుడికి బాగా తెలుసు అనే ధృడనిర్ణయం నీకు రావాలి. మనకు ఏది మంచిదో, మనకు ఏది క్షేమమో మనకు తెలియదు. మనకు ఏది మంచిదో, దేని వలన మనకు జ్ఞానం కలుగుతుందో మనకంటే ఈశ్వరుడికి బాగా తెలుసు. అటువంటి ఈశ్వరుడికి శరణాగతి చెందటానికి నీకు అభ్యంతరం ఎందుకు? మినహాయింపులు ఎందుకు? మినహాయింపులు లేకుండా ఆయనను శరణు వేడుకొంటే ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు.

